
మనం
కడప | అన్నమయ్య



# ఓటరు జాబితాల పారదర్శకత, ఖచ్చితత్వం కోసం ప్రత్యేక సవరణ ప్రక్రియ

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

కడప, మే 29(మనం న్యూస్)

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - 2026ను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎన్నికల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఉ జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ 2026 పై జేసీ డి. నిధి మీనా, డిఆర్వో మల్లికార్జునుడు లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితాల సమగ్రత అత్యంత కీలకమని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితాలు అవసరమని, అందుకే భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు.



దేశవ్యాప్తంగా గతంలో పలు దఫాలు సార్ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయని, 2004 తర్వాత విస్తృత స్థాయిలో ఈ ప్రక్రియ జరగలేదని పేర్కొన్నారు. వేగవంతమైన పట్టణీ కరణ, ఉద్యోగాలు, విద్య కోసం వలసలు పెరగడం, ఒకే వ్యక్తి పేరు పలుచోట్ల నమోదయ్యే అవకాశాలు, మరణించిన లేదా అనర్హుల పేర్లు కొనసాగుతున్నాయనే అంశాల నేపథ్యంలో ఓటరు జాబితాల సమగ్ర పరిశీలన అవసరమైందన్నారు. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా వెలుపల ఉండకూడదనే దానితో పాటు, అనర్హుల పేర్లు జాబితాలో ఉండకుండా చూడడమేనని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం గత ప్రత్యేక సమగ్ర సవరణలో నమోదైన వివరాలకు ప్రామాణికత కల్పించబడుతుందని చెప్పారు.

ఈ ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరికి ముందుగా వివరాలు ముద్రించిన ఎన్యుమరేషన్ ఫారమ్ (ఎఫ్ ) ఇవ్వబడుతుందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ( బి ఎల్ ఓ లు) ఇంటింటికీ వెళ్లి ఫారమ్‌లను పంపిణీ చేసి, వాటిని తిరిగి సేకరిస్తారని చెప్పారు. ఓటరు ఇంటి వద్ద లేని పక్షంలో కనీసం మూడు సార్లు సందర్శించి ఫారమ్ స్వీకరించేలా చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఫారమ్ సమర్పించిన ప్రతి అర్హ ఓటరి పేరు ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చబడుతుందని, ఫారమ్ అందని వారి పేర్లు ముసాయిదాలో ఉండకపోవచ్చని తెలిపారు. అయితే ఎవరైనా పేరు తొలగించే ముందు తప్పనిసరిగా వినతులు స్వీకరించి విచారణ జరిపి మాత్రమే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు నియమించే బూత్ లెవల్ ఏజెంట్లు ( బి ఎల్ ఏ ఎస్ ) కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ కోరారు. బి ఎల్ ఏ ఎస్ ద్వారా రోజుకు 50 వరకు ఎన్యుమరేషన్ ఫారమ్‌లు సమర్పించవచ్చని తెలిపారు. అలాగే క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల దశలో రోజుకు 10 వరకు దరఖాస్తులు ఇవ్వవచ్చని వివరించారు.

కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫారం-6తో పాటు డిక్లరేషన్ ఫారం సమర్పించాలని చెప్పారు. పేరు తొలగింపుకు ఫారం-7, సవరణలు లేదా మార్పులకు ఫారం-8 ఉపయోగించాల్సి ఉంటుందని వివరించారు.

ఓటరు జాబితా ముసాయిదా ప్రచురణ అనంతరం క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల ప్రక్రియ చేపడతామని తెలిపారు. అందిన అన్ని అభ్యంతరాలు, దరఖాస్తులు ఈ ఆర్ వో కార్యాలయ నోటీస్ బోర్డులలో, సీఈఓ వెబ్‌సైట్‌లో ప్రదర్శించబడతాయని, ప్రతి వారం రాజకీయ పార్టీలతో కూడా పంచుకుంటామని చెప్పారు.

గత సంవత్సరంలో నమోదైన వివరాలతో సరిపోలని సందర్భాల్లో విచారణ చేపట్టి అవసరమైతే పౌరసత్వం, నివాసం, జనన తేదీ వంటి అంశాలకు సంబంధించి ఆధారాలు పరిశీలిస్తామని తెలిపారు. అయితే ఆధార్ కార్డు కేవలం గుర్తింపు పత్రం మాత్రమేనని, అది పౌరసత్వం లేదా జనన తేదీకి పూర్తి ఆధారం కాదని ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు.

ఈ కార్యక్రమంలో వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్న వారు, బలహీన వర్గాల ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక వాలంటీర్లను నియమించి అవసరమైన సాయం అందించనున్నట్లు తెలిపారు.

తుది ఓటరు జాబితా ప్రచురణ అనంతరం కూడా అసంతృప్తి ఉన్నవారికి జిల్లా మేజిస్ట్రేట్ స్థాయిలో మొదటి అప్పీల్, అనంతరం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి రెండో అప్పీల్ చేసే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు చేయగా, వాటిని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎస్.ఐ.ఆర్., ఎలాక్టోర్ రోల్ పబ్లిష్, తదితర అన్ని అంశాల్లో.. ప్రజలను తప్పుదోవ పట్టించే సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతలను నమ్మకుండా.. అన్ని పార్టీల ప్రతినిధులు.. ప్రజలకు, ఎలక్టోరల్ సిబ్బందికి సహకరించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని ఏ మాత్రం మిస్ అవ్వకుండా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్ రెడ్డి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు డా. బి. శ్రీనివాసులు (యాప్ ), ఎస్. గురప్ప (బీస్పీ ), జి.ఎస్.టి. లక్ష్మణరావు (బిజెపి ),జి. చంద్రశేఖర్ (సీపీఐ ఎం), బి. పాల్ సుధాకర్ (ఐ ఇన్సీ ), పి. విశ్వనాథ్ - (జనసేన పార్టీ), వైఎస్ జబీవుల్లా (టీడీపీ ), పి. సునీల్ కుమార్ (వైస్సార్‌సీపీ ) తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్‌రాజు**

**ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించిన చమర్తి**



రాజంపేట మనం న్యూస్ మే 29: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్‌రాజుల తెలియజేశారు. శుక్రవారం నాడు స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయం నందు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులను జగన్ మోహన్ రాజు స్వీకరించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని,ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపుతామని చమర్తి స్పష్టం చేశారు. అదేవిధంగా భూ సమస్యలు/ వీటితోపాటు మౌలిక సదుపాయాల కల్పన,పెన్షన్స్, డ్రైనేజ్, రోడ్డు నిర్మాణం వంటి సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమం లో పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ముక్కా రూపానంద రెడ్డి కృషి





రైల్వేకోడూరు, మే 29, మనంన్యూస్: రైల్వే కోడూరు నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను నేరుగా ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్యలు, దెబ్బతిన్న రహదారులు, పెన్షన్ ఇబ్బందులు, భూ సమస్యలు, విద్యుత్ తదితర అంశాలపై వినతులు అందజేశారు. ప్రజల సమస్యలను ఓపికగా విన్న ముక్కా రూపానంద రెడ్డి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండటం తమ బాధ్యతగా భావిస్తున్నామని స్పష్టం చేశారు.ప్రతి వారం ప్రజాదర్బార్ నిర్వహించడం ద్వారా ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని కొనసాగిస్తూ, వారి సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజలకు దగ్గరగా ఉండి సమస్యలను పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఎన్డీఏకూటమి నాయకులు, కార్య కర్తలు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ‘ఆపరేషన్ దండయాన్’లో భాగంగా మహిళలు, విద్యార్థినీలకు అవగాహన

**మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు**

**జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్**





కడప మే 29 (మనంన్యూస్): మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హెచ్చరించారు. శుక్రవారం రిమ్స్ లో ‘ఆపరేషన్ దండయాన్’లో భాగంగా మెడికల్ కాలేజ్ సెమినార్ హాలులో రిమ్స్ మెడికల్ కాలేజ్ వైద్య విద్యార్థులకు, దంత వైద్య, నర్సింగ్ విద్యార్థులకు మహిళా భద్రతపై, చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, రాష్ట్ర డి.జి.పి ఉత్తర్వుల మేరకు పోలీస్‌శాఖ మహిళా భద్రతను అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగా మహిళా భద్రత పై రిమ్స్ మెడికల్ కాలేజ్ లో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కాలేజ్ విద్యార్థులు, మహిళలు ఇందులో పాల్గొన్నారని, రిమ్స్ ప్రిన్సిపాల్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, సైకాలజిస్ట్ పాల్గొనడం జరిగిందన్నారు. 95శాతం మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసు లను జిల్లా పోలీస్ శాఖ ఛేదించడం జరిగిందని జిల్లా ఎస్.పి వివరించారు. మహిళలపై నేరాలకు పాల్పడిన కేసులలో గత రెండేళ్లలో 44 కేసుల్లో న్యాయస్థానాల్లో శిక్షలు ఖరారు చేశాయని, వీటిలో 16మందికి జీవిత ఖైదు, ఒకరికి 20 సంవత్సరాల శిక్ష, 10 మందికి 7, 5, 3 సంవత్సరాల చొప్పున జైలుశిక్షతో పాటు జరిమానా కూడా విధించడం జరిగిందన్నారు. రౌడీ షీట్ ల తరహాలో లైంగిక నేరాలకు పాల్పడ్డ 200 మంది పై సెక్సువల్ అఫెండర్ షీట్ లను తెరవడం జరిగిందన్నారు. ఒక్కసారి సెక్సువల్ అఫెండర్ షీట్ తెరిస్తే అతనిపై నిరంతరం పోలీస్ నిఘా ఉంటుందని తెలిపారు. పోక్సో, రేప్ కేసుల్లో, వేధింపుల కేసుల్లో ఉన్న వారిపై కూడా షీట్ ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. షీట్ ఒక్కసారి ఓపెన్ చేస్తే జియో ట్యాగింగ్ చేయడం జరుగుతుందని, వారి ప్రతి కదలికపై నిఘా ఉంటుందని తెలిపారు. ఎక్కడ ఉంటున్నారు, ఎక్కడెక్కడికి వెళుతున్నారు, డబ్బు ఎక్కడి నుండి వస్తోంది, ఎవరితో మాట్లాడుతున్నారు, అనే విషయాలపై లోతుగా నిఘా ఉంచడం జరుగుతుందని ఎస్.పీ వివరించారు. మహిళలపై నేరాలను రాష్ట్ర ముఖ్యమంత్రి, పోలీస్ శాఖ చాలా సీరియస్ గా పరిగణిస్తుందని, మహిళలు ఏదైనా సమస్య ఉంటే శక్తి యాప్, డయల్ 112, పోలీస్ అధికారులను సంప్రదిస్తే తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్.పీ హెచ్చరించారు.



# శుభతిథి క్యాలెండర్ ఆవిష్కరణ

**రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు**

రాజంపేట మనం న్యూస్ మే 29: హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ ఆర్థిక కార్యదర్శి సమ్మెట శశిధర్ మరియు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్ రాజంపేటలోని జనసేన పార్టీ కార్యాలయం యల్లటూరు భవన్ నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుభతిథి క్యాలెండర్‌ను యల్లటూరు శ్రీనివాస రాజు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. అనంతరం వారు సామాజిక, సాంస్కృతిక మరియు ధార్మిక అంశాలపై స్నేహపూర్వకంగా చర్చించారు. ఈ సందర్భంగా హిందూ ఉపాధ్యాయ సమితి ప్రతినిధులు యల్లటూరు శ్రీనివాసరాజుకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇంటర్మీడియట్ విద్యాశాఖలో చారిత్రాత్మక పదోన్నతులు: ఉద్యోగుల హర్షం

పుల్లంపేట మే 29మనం న్యూస్: కడప ఇంటర్మీడియట్ విద్యాశాఖలో నాన్ టీచింగ్ సిబ్బందికి గతంలో ఎన్నడూ లేనివిధంగా విస్తృత స్థాయిలో పదోన్నతులు కల్పించడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.సురేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ పదోన్నతుల ప్రక్రియ విద్యాశాఖ చరిత్రలోనే ఒక చారిత్రాత్మక నిర్ణయంగా నిలిచింది. ఈ ప్రక్రియలో అటెండర్ల నుండి రికార్డ్ అసిస్టెంట్స్‌గా, రికార్డ్ అసిస్టెంట్ల నుండి జూనియర్ అసిస్టెంట్స్‌గా,జూనియర్ అసిస్టెంట్ల నుండి సీనియర్ అసిస్టెంట్స్‌గా పదోన్నతులు కల్పించారు. అలాగే 10% కోటా ద్వారా జూనియర్ లెక్చరర్స్‌గా, 20% కోటా ద్వారా లైబ్రేరియన్లుగా నాన్ టీచింగ్ సిబ్బందికి ప్రమోషన్లు లభించాయి. ఇవి ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

**నాయకులకు కృతజ్ఞతలు:**

ఈ పదోన్నతుల సాధన కోసం అహర్నిశలు కృషి చేసిన పలువురు ఉద్యోగ సంఘాల నాయకులకు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌సభ్యులు తమ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా అలపర్తి విద్యాసాగర్ (AP NGGOμs రాష్ట్ర అధ్యక్షులు, జేఏసీ చైర్మన్) డి.వి.రమణ (AP NGGOμs రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) మరియు తిరుపతి జిల్లా ప్రెసిడెంట్ సురేష్ బాబుకి బి.శ్రీనివాసులు (కడప జిల్లా ఎన్జీవోస్ అధ్యక్షులు) ఏ.శ్రీనివాసులు (రాష్ట్ర ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అసోసియే షన్ అధ్యక్షులు) తమ సమస్యల పరిష్కారానికి, పదోన్నతుల సాధనకు ప్రత్యేక కృషి చేసిన ప్రతి ఒక్కరికీ తాము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని ఉద్యోగులు పేర్కొన్నారు.

## ఈదురు గాలులకు చెట్లు నేలమట్టం



ముద్దనూరులో, 29, (మనం న్యూస్): మండలంలో గురువారం రాత్రి భీకర గాలి వాన ప్రజలను కొంత సమయం అల్లా కల్లోలం చేసింది. మేజర్ గ్రామపంచాయతీలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న వేపచెట్టు సుమారు 100 సంవత్సరాల పైబడే వయసు ఉన్న చెట్టు కూపటి వేర్లతో సహా పీకలించుకుని నేలమట్టం అయ్యింది. పట్టణంలో అక్కడక్కడ పదుల సంఖ్యలో చెట్లు నేలమట్టమయి, కొమ్మలు క్రిందపడి విద్యుత్ తీగల మీద పడి విద్యుత్ అంతరాయం కలగడంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మండల అధికారులు, విద్యుత్ ఏ ఈ.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, అప్రమత్తమై ఎక్కడ విద్యుత్ వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని విద్యుత్ తీగలను సరిచేసి, మధ్యాహ్నం విద్యుత్ సరఫరా ను అందించడంతో ప్రజలు సిబ్బందిని హర్షించారు .

## అకాల వర్షంతో అరటి నేలమట్టం



ముద్దనూరు, మే, 29, (మనం న్యూస్ ): మండల పరిధిలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షంతో పాటు తీవ్రమైన గాలితో మండల రైతులు సాగు చేసిన అరటి బొప్పాయి తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. మండల ఉద్యాన శాఖ అధికారి మహేశ్వర్ రెడ్డి, రైతు సేవా కేంద్ర సిబ్బంది శుక్రవారం అరటి పంటను పరిశీలించి మండలంలో ఆరవేటి పల్లె దేనే పల్లె, బొందల కుంట, గంగాదేవి పల్లె గ్రామాలలోని రైతులు సాగు చేసిన సుమారు 45 ఎకరాలలో అరటి పంటలు, ఈదురు గాలులకు నేలమట్టం అవడంతో నష్టపోయిన అరటి పంటను పరిశీలించి సుమారు 23 లక్షల మేర నష్టం వాటిలో ఉంటుందని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## జిల్లాలో రాష్ట్ర సిఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్

కడప మే 29 (మనం న్యూస్) : రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా.. శుక్రవారం ఉదయం వైఎస్ఆర్ కడప జిల్లాకు చేరుకున్న రాష్ట్ర సి.ఆర్.మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్. కడప ఆర్ & బి గెస్ట్ హౌస్ బసచేసిన రాష్ట్ర సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్‌కుమార్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ ఏడి బి. పద్మజ, ఏఈఐ ఈ శ్రీనివాసరావు, ఏవిఎస్ నాగయ్య, పలువురు పాత్రికేయులు. ఈ నెల 30,31 తేదీల్లో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కడప జిల్లా గ్రామీణ విలేఖరులకు నిర్వహించే.. పునశ్చరణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరవ్వనున్న చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్.



# ఆర్యవైశ్యులను కించపరిచేలా మాట్లాడిన పంచు ప్రభాకర్ పై ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్ ఆగ్రహం

ప్రొద్దుటూరు మే (29) మనం న్యూస్ :ఆర్యవైశ్య సమాజాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసిన యాక్టివిస్టు పంచ్ ప్రభాకర్‌పై ప్రభుత్వం వెంటనే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రొద్దుటూరు ఆర్యవైశ్య సభ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అమ్మవారి శాలలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుశెట్టి రామ్మోహన్ మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా కొందరు వ్యక్తులు కులాల మధ్య విభేదాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఇలాంటి ద్వేషపూరిత ప్రచారాలపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొందరిలో మార్పు కనిపించడం లేదని విమర్శించారు. ముఖ్యంగా పంచ్ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్యవైశ్య సమాజం శతాబ్దాలుగా వ్యాపార, సేవా రంగాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించుకుని సమాజ సేవలో ఎప్పుడూ ముందుంటుందని నాయకులు గుర్తు చేశారు. అన్నదాన కార్యక్రమాలు, విద్యార్థులకు ఆర్థిక సహాయం, వైద్య సేవలు, పేదల వివాహాలు, సామూహిక కళ్యాణ కార్యక్రమాలు వంటి అనేక సేవా కార్యక్రమాలు



నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. అలాంటి సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని అవమానకర వ్యాఖ్యలు చేయడం అసహనానికి గురిచేస్తోందన్నారు. ఆర్యవైశ్య ప్రముఖుడు టీజీ వెంకటేశ్వర్లు మరియు ఆయన కుటుంబ సభ్యులపై కూడా అసభ్యకర వ్యాఖ్యలు చేయడం మరింత బాధాకరమని నాయకులు పేర్కొన్నారు. టీజీ వెంకటేశ్వర్లు కులమతాలకు అతీతంగా సామూహిక వివాహాలు నిర్వహిస్తూ అనేక పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. సమాజ సేవలో నిమగ్నమైన వ్యక్తులపై వ్యక్తిగత విమర్శలు చేయడం దురదృష్టకరమన్నారు. రాజకీయ విమర్శలు వేరు, కుల సంఘాలను కించపరచడం వేరు అని స్పష్టం చేసిన నాయకులు, ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో అనవసర ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని సూచించారు. వ్యక్తిగత అభిప్రాయాల పేరుతో సమాజాల మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నాలను ప్రభుత్వం కఠినంగా అరికట్టాలని కోరారు. పంచ్ ప్రభాకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్య సంఘాలు కలిసి ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. త్వరలోనే ప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్‌లో అధికారిక ఫిర్యాదు అందజేస్తామని తెలిపారు. అవసరమైతే పరువు నష్టం దావాలు కూడా దాఖలు చేస్తామని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య సభ నాయకులు సీవీ సురేష్, నాగేశ్వరరావు మాట్లాడుతూ విదేశాల్లో ఉంటూ సామాజిక వర్గాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం వెనుక మరికొందరి ప్రోత్సాహం ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోని ఆర్యవైశ్య సంఘాలు కూడా ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సభ జాయింట్ సెక్రటరీ మల్లెంకొండు ప్రతాప్, సభ్యులు జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాష్, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ మహాసభను జయప్రదం చేయాలి: డి హెచ్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం కాలయ్య పిలుపు

పుల్లంపేట మే 29 (మనం న్యూస్): తిరుపతి జిల్లా ఓబులవారిపల్లి మండలం లో డి హెచ్ పి ఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చింతలపూరి నాగమ్మ అధ్యక్షత తో డి హెచ్ పి ఎస్ మండల మహాసభ జరిపి నూతన మండల కమిటీ లో అధ్యక్ష కార్యదర్శులను మండల సమితి సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ సందర్భంగా. చిన్నం కాలయ్య డి హెచ్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి. జ్యోతి చిన్నయ్య డి హెచ్ పి ఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర పిలుపు మేరకు ఈనెల 31వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు రైల్వే కోడూర్ లో డి హెచ్ పి ఎస్ నియోజకవర్గ మహాసభ జరుగుతుంది ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా కామ్రేడ్ కరవది సుబ్బారావు డిహెచ్ఈఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. కామ్రేడ్ పి మురళి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తిరుపతి జిల్లా కార్యదర్శి. కామ్రేడ్ చిన్నం పెంచలయ్య డి హెచ్ పి ఎస్ జిల్లా నిర్మాణ బాధ్యులు. అబ్దుల్లా అధ్యక్షులు డాక్టర్ ఆర్ బలరాం. కామ్రేడ్ నాగభూషణం డి హెచ్ పి ఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు కామ్రేడ్ కాలయ్య, డి హెచ్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హాజరవుతున్నారు అందువలన రైల్వే కోడూరు నియోజకవర్గం లో ఐదు మండలాల నుండి దళితులు ఐక్యంగా కదలి తరలివచ్చి ఈ నియోజకవర్గం మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## డ్రగ్స్ పై దండయాత్ర 2.0 కార్యక్రమం విజయవంతం

రైల్వేకోడూరు మే 29 ,మనం న్యూస్: ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు,తిరుపతి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ సూచనలతో, అదనపు ఎస్పీ (క్రైమ్స్) ఆర్ల శ్రీనివాసరావు నేతృత్వంలో, రేణిగుంట సబ్-డివిజన్ పోలీసు అధికారి వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహిస్తున్న "డ్రగ్స్ పై దండయాత్ర-2.0"కార్యక్రమంలో భాగంగా, రైల్వే కోడూరు పట్టణంలోని మామిడికాయల మార్కెట్ వద్ద మరియు ఓబులవారిపల్లి మండలంలోని ఏపీఎండీసీ ప్రాంతం, మంగంపేట వద్ద ప్రత్యేక డ్రగ్ అవగాహన మరియు పరీక్షా కార్యక్రమం నిర్వహించబడింది. "పరీక్ష చేద్దాం-మత్తును వదిలిద్దాం" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డ్రగ్ డిటెక్షన్ బస్సు మరియు గంజాయి వినియోగాన్ని గుర్తించే ఆధునిక కిట్ల సహాయంతో పరీక్షలు నిర్వహించారు. ఇందులో రైల్వేకోడూరు మండలంలోని మామిడికాయల మార్కెట్ పరిసర ప్రాంతంలో




150మందికి, ఓబులవారిపల్లి మండలంలోని ఏపీఎండీసీ ప్రాంతంలో మరో 150మందికి గంజాయి గుర్తింపు పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం తిరుపతి జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కట్టుబడి పని చేస్తోందని తెలిపారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం, నిల్వ, అక్రమ రవాణా వంటి కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని స్పష్టం చేశారు.సమాజాన్ని మత్తు రహితంగా మార్చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. ప్రజలు తమ పరిసరాల్లో ఎవరైనా మాదక ద్రవ్యాల వినియోగం లేదా అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం అత్యంత అవసరమని, పోలీస్ శాఖతో కలిసి ముందుకు వస్తే సమాజాన్ని సురక్షితంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దగలమని అధికారులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు, రైల్వే కోడూరు టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, కోడూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. శ్రీనివాసులు, రైల్వే కోడూరు టౌన్ ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, ఓబులవారిపల్లి ఎస్ఐ పి.మహేష్‌తో పాటు పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

## గంగమ్మ జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొరుముట్ల శ్రీనివాసులు, కొండూరు అజయ్ రెడ్డి



చిట్వేలి మే 29 మనం న్యూస్ ప్రతినిధి: మండల కేంద్రంలోని మహారాజపురం గ్రామంలో గురువారం గంగమ్మ జాతరను గ్రామ ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు పుల్లగంటి శ్రీనివాసులు ఆహ్వానం మేరకు గంగమ్మ తల్లి జాతర సందర్భంగా హాజరై అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం పలువురి వైయస్సార్సీపి నాయకులు స్వగృహానికి వెళ్లి వారి ఆతిథ్యం స్వీకరించిన వైయస్సార్ సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, కడప పార్లమెంటు నియోజకవర్గల పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి. తదుపరి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, ఓబులవారిపల్లి మండల కన్వీనర్ సాయి కిషోర్ రెడ్డి, శంకర్ రెడ్డి, ఉప సర్పంచ్ శివ సాయి, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి లింగం లక్ష్మీకర్, సీనియర్ నాయకులు మాదినేని వెంకట్ రెడ్డి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు, నారాయణమ్మ, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం రెడ్డి, రమణ రెడ్డి, సానరెడ్డి లకు శాలువాతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. కార్యక్రమంలో చిట్వేలి మండల వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా కన్వీనర్ కోటేశ్వర్ రెడ్డి, మహారాజపురం గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ..మెగా హిట్ అవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్న వైసీపీ: నిరుద్యోగ జేఏసీ



రాజంపేట మనం న్యూస్ మే 29: కూటమి ప్రభుత్వం భర్తీ చేసిన 2025 మెగా డీఎస్సీ విజయవంతం అవ్వడాన్ని వైసీపీ పార్టీ జీర్ణించుకోలేక పోతుందని జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్దిక్ తెలిపారు. వాస్తవానికి వైసీపీ పాలనలోనే నిరుద్యోగులను మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ పేరుతో మెగా మోసం జరిగిందని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన మొదటి సంతకం హామీ నెరవేర్చి నిరుద్యోగులకు అండగా ఉంటే డీఎస్సీ లో అక్రమాలు అంటూ వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు.వందల సంఖ్యలో కోర్టులో అక్రమ కేసులు వేసి డీఎస్సీ నీ పాలనే ప్రయత్నం చేశారన్నారు.నిరుద్యోగులు ఎవ్వరూ నమ్మే పరిస్థితి లేదని నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగానే జరిగిందని చంద్రబాబు అంటేనే నిజాయితీగా ఉద్యోగాల భర్తీ చేస్తారన్న బ్రాండ్ ఉందని, ఇలాగే వైసీపీ పార్టీ తప్పుడు వార్తలను ప్రచారం చేస్తే రోడ్లపై నిరగనివ్వం అని షేక్ సిద్దిక్ వైసీపీ పార్టీ నీ హెచ్చరించారు.

## కోదండ రామాలయాన్ని దర్శించుకున్న సిఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్




ఒంటిమిట్ట, మే 29 (మనం న్యూస్) రాష్ట్ర సి.ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్.. సుప్రసిద్ధమైన ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయాన్ని సందర్శించారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం కడపకు విచ్చేసిన రాష్ట్ర సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్‌కుమార్. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ అందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి, అనంతరం ఆలయ రంగ మండపంలో ఆలయ సత్కారాలు, తీర్థ ప్రసాదాలు అందించి కోదండరామాలయ చారిత్రక వైభవాన్ని, ప్రాశస్త్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సమాచార పౌర సంబంధాల శాఖ ఏడి బి. పద్మజ, జర్నలిస్టు యూనియన్ నాయకులు, స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు.

